క్లుప్తంగా

చల్లబడిన వాతావరణం

గురజాల: వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు పల్నాడు ప్రాంతంలో నమోదయ్యాయి. గత వారం ఎండల తాకిడికి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోయారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడింది. ఉదయం వేళ ఎండ వచ్చినప్పటికి సాయంత్రం వాతావరణం చల్లబడుతోంది. వేసవి దుక్కులు దున్నుకునేందుకు రైతులు సమయత్తమవుతున్నారు.

బహుమతుల ప్రదానం



దాచేపల్లి: మండలంలోని గామాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నూతన వస్త్రాలు, ప్రోత్సాహ బహుమతులను ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పాఠశాల ఉపాధ్యాయురాలు గాజుల నాగ దస్తగిరమ్మ అందజేశారు. విద్యార్థుల చదువులకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, ఉప సర్పంచ్ షేక్ పెద హుస్సేన్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలవాయిలో ఇరువర్గాల ఘర్షణ

రెంటచింతల: మండలంలోని పాలవాయి గ్రామంలో గురువారం ఉదయం జరిగిన ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కొన్నేళ్లుగా ఆలయ భూములను ఇరు వర్గాల వారు సాగు చేసుకుంటున్నారు. ఆ భూములన్నీ ఒక వర్గం సాగు చేసుకోవాలనే వ్యవహారంలో వివాదం తలెత్తింది. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగటంతో ఏడుగురికి గాయాలయ్యాయి. తురక మంగమ్మ, తురక వెంకటేశ్వర్లు, వేముల బాలయ్య, వేముల నాగరాజు ప్రత్యర్థి వర్గానికి చెందిన దేరంగుల సాంబశివరావు, వీరాస్వామి, శ్రీనుకు గాయాలయ్యాయి. సమాచారమందుకున్న 108 వాహన సిబ్బంది హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని గురజాల ప్రభుత్వాసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. వీరికి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బాధితులంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన బంధువులు కావటం విశేషం.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

వినుకొండ(నూజెండ్ల): శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. మండల కేంద్రమైన నూజెండ్ల, జంగాలపల్లి, పమిడిపాలు, కంభంపాడు, గ్రామాలతోపాటు ఈపూరు మండలం ముప్పాళ్ల, రూరల్ మండలం దొండపాడు, గ్రామాలతోపాటు పలుగ్రామాల్లో ఆరాధనోత్సవాలు నిర్వహించేందుకు భక్తులు అనీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాతపూడి హైవే అండర్‌పాస్ వంతెన సమీపంలో గురువారం తెల్లవారుజాము 6.30 గంటల సమయంలో హైవేపై వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. గాయాలైన యువకుడిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి 25-30 మధ్య వయసు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు రూరల్ ఎస్ఐ జి రవికృష్ణ సెల్‌నం: 94409 00880కు అందించాలని కోరారు.

గొడవలను నివారించి శాంతిభద్రతలు కాపాడండి



నరసరావుపేట: జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఏర్పడిన గొడవలను నివారించి శాంతి భద్రతలను కాపాడాలని సీపీఎం, కౌలు రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీలకు నాయకులు సయ్యద్ మహమద్ హుస్సేన్, డి.శివకుమారి, ఇ.మస్తాన్‌రెడ్డి, రబ్బాని, షేక్ సిలార్, కామినేని రామారావు, ఆంజనేయులు నాయక్ వినతిపత్రం అందజేశారు. గొడవలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని, అనుమానం ఉన్నవారిని బైండోవర్ చేయాలని, బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీసీహెచ్ బోసు, దుర్గాభాయి పాల్గొన్నారు.

పశు పోషణకు భరోసా

- ప్రతి నియోజకవర్గంలో ప్రయోగశాల
- పశువులకు సోకే వ్యాధులపై నిర్ధారణ పరీక్షలు
- పశుసంపద వృద్ధికి కృషి



గురజాలలో ప్రారంభించిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రం



నిర్ధారణ కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన పరికరాలు



నిర్ధారణ కేంద్రంలోని పరికరాలు

జిల్లాలో పశువులు వివరాలు ఇలా

పశువుల	సంఖ్య
ఆవులు	66072
గేదలు	467046
గొర్రెలు	469424
మేకలు	156291

గురజాల: వ్యవసాయానికి , రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణపై కూడా దృష్టి సారించి పశుపోషకులకు అండగా నిలిచింది. ప్రతి నియోజకవర్గంలోప్రభుత్వం ప్రారంభించిన పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల ద్వారా పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,వినియోగించాల్సిన మందులు తదితర అంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా పశు పోషకులు తమ పశు సంపదను పరిరక్షించుకునే అవకాశం కలుగుతుంది.

రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ పై జీవనాధారం పొందుతున్నారు. కాలక్రమంలో పశు సంపద పెరిగినట్లుగానే వాటికి సంక్రమించే వ్యాధుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చినట్లుగానే పాడి పరిశ్రమకు కూడా ప్రాధాన్యతనిచ్చే విధంగా ప్రతి నియోజకవర్గంలో ఒక పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యాధుల బారిన పడి పశువులు అకాల మృత్యువాత చెందకుండా కృషి చేస్తున్నారు. పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని పశువులను రక్షించే రక్షణలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి మూగజీవాల పాలిట దైవంగా మారారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీని వలన పశువులు వ్యాధుల బారిన పడితే సులభంగా కేంద్రాలకు తరలించి వైద్యం చేయించేందుకు అవకాశం కలుగుతుంది.

ప్రయోగాలు ఇలా

పశువుల మూత్రం, పేడ, చర్మ సమస్యలకు సంబంధించిన నమూనాలను ఈ ప్రయోగశాలలో పరీక్షించివ్యాధి లక్షణాలు గుర్తిస్తారు. వీటితో పాటు పశువులకు పలు రకాల టీకాలు వేశాల వాటి పనితీరు, పశువుల్లో ఏదైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం లాంటివి. ఈ ప్రయోగశాలల్లో జరుపుతారు. అదేవిధంగా పశువుల నుంచి ప్రజలకు సంక్రమించే వ్యాధులను గుర్తించే విధంగా ఏర్పాట్లు చేశారు. పాలు, రక్తనమూనాలు, యాంటీబయోటిక్ నిర్ధారణ పరీక్షలు,లను రక్తనమూనాలు సేకరించి ఏ యాంటీ బయోటిక్ మందు ఇస్తే పశువుకు వ్యాధి తగ్గుతుందిగుర్తించడం వ్యాధుల బారిన పడి మృతి చెందిన పశువులకు శవ పరీక్షలు ,ఇలాంటివన్నీ ఈ ప్రయోగశాల్లో నిర్వహిస్తారు. గొర్రెలు, మేకలుకు సోకే నట్టల నిర్ధారణకు , దానికి తగువైన మందులు ఇచ్చేందుకు అక్కడ ప్రయోగాలు జరుగుతాయి. అదే విధంగా కోళ్లకు సంబంధించిన వ్యాధులను కూడా గుర్తించడం జరుగుతుంది.

నాడు అలా.. నేడు ఇలా

గతంలో వ్యాధి నిర్ధారణ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో తెలిసిన వైద్యం చేసి మందులు వాడేవారు దీంతో తీవ్ర నష్టం వాటిల్లేంది. మండల కేంద్రాల నుంచి జిల్లా హెడ్‌క్వార్టర్‌కు శాంపిల్స్ పంపిచడం ఆ తరువాత ఎప్పటికో రిపోర్టులు రావడం వంటివి జరిగేవి. ఈ లోపు రైతుకు జరగాల్సిన నష్టం జరిగిపోయేది.గతంలో వైద్య సేవలు లేక ఎన్నో పశువులు మృత్యువాత పడిన సంఘటనలు కొకల్లలు. టీడీపీ ప్రభుత్వం హయాంలో పాడి రైతులు పశువుల పోషణ భారంగా ఉండటంతో పశుసంపదలు అమ్ముకున్న సందర్భాలు లేకపోలేదు. ప్రత్యేకించి పల్నాడు ప్రాంతంలో మూగజీవాల మనోవేదన పట్టించుకునే దిక్కుమొక్కు లేక పశువులు మృతిచెందేవి. సరైన పశువైద్యశాలలు డాక్టర్లు సిబ్బంది సక్రమంగా లేకపోవడంతో పశువైద్యం దయనీయంగా ఉండటంతో వైద్యం అందక ఎన్నో ఇబ్బందులు పడిన పరిస్థితి నెలకొంది. దీని వలన పశుపోషకులు ఎంతో నష్టం వాటిల్లింది. ఎక్కడో .ఒక చోట ఉండే వైద్యశాలకు పశువులను తీసుకువెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేంది. కానీ నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వ్యవసాయం తరువాత ప్రధానమైన పశుపోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వ్యాధినిర్ధారణ వైద్యపరీక్షలు, పశువులకు చికిత్స అందించడం తదితర సేవలు అన్ని క్షేత్రస్థాయిలో పశుపోషకులకు అందే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలో సంచార పశు వైద్యశాలలు తిరుగుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపుతున్నారు.అదే విధంగా రైతు భరోసా కేంద్రాలు, మండల కేంద్రాల్లో పశు వైద్య విభాగానికి సంబంధించిన వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచుతున్నారు. దీనివలన పాడిరైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రత్యేకించి తాజాగా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయని పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశువుల్లో వ్యాపించే వ్యాధులు, సంతానోత్పత్తి, టీకాలు పాల దిగుబడి పెంచడం తదితర అనేకమైన పశు సంబంధ సమస్యలను ఆయా వ్యాధులను గుర్తించి తొలిదశలోనే వైద్యం అందించే విధంగా చూస్తారు. అత్యాధునిక పరికరాలు, అనుభవం కలిగిన వైద్యులు అందుబాటులో వుంచి పశువులు ఆరోగ్య పరిస్థితి బాగుండే విధంగా చర్యలు చేపట్టారు.

దాచేపల్లి ఓటింగ్ శాతం 84.5

దాచేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. పట్టణ ప్రాంతాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపించారు. దాచేపల్లి మండల పరిధిలో రాత్రి 12 గంటల వరకు పోలింగ్ జరగటం పరిశీలిస్తే ఓటు వేసేందుకు ఓటర్లంతా ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా 66,512 మంది ఓటర్లు ఉండగా 56,237 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 28,067 మంది, మహిళలు 28,164 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 84.5శాతం మేర పోలింగ్ నమోదయ్యింది. గ్రామాల వారీగా ఓట్ల వివరాలు పరిశీలిస్తే... పెదగార్లపాడులో 3,621, కేసానుపల్లిలో 2,867, తక్కెళ్లపాడులో 1,729, నడికుడిలో 9,585, అలుగుమల్లెపాడులో 277, ఇరికేపల్లిలో 2,417, గామాలపాడులో 3,001, శంకరపురంలో 302, పొందుగలలో 1,425, శ్రీనివాసపురంలో 388, రామాపురంలో 3,658, భట్రుపాలెంలో 1,156, కాట్రపాడులో 575, కొత్తూరులో 804, ఎస్. అగ్రహారంలో 985, మాదినపాడులో 2,205, దాచేపల్లిలో 13,256, ముత్యాలంపాడులో 3,499, తంగెడలో 4,487 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓటు వేసేందుకు క్యూ లో నిల్చున్న మహిళలు(ఫైల్)

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రొంపిచర్ల: వేసవి విజ్ఞాన శిబిరాన్ని సెలవులలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంతగుడిపాడు ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి కె. వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయాలలో వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం విజ్ఞాన శిబిరాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి చదువుకోవడం అలవాటు చేయడమే శిబిరం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా నిర్వహించేందుకు రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్‌గా సేవలు అందించాలని ఆయన కోరారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి కథ వినడం, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు పిల్లలతో ఆటలు ఆడించడం, 10 గంటల నుంచి 10 నిమిషాల పాటు విరామం, తిరిగి 10.10 నుంచి 10.30 గంటల వరకు పుస్తక సమీక్ష, 11 గంటల వరకు కథలు చెప్పడం, 11 గంటల నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, మ్యూజిక్, డ్యాన్స్, గెస్ట్ లెక్చరర్లు, థియేటర్ ట్రైనింగ్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాల అధికారి కోరారు.

ఫలించని 70 రోజుల చికిత్స

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ రైతు మృతి



బొప్పూడి అప్పారావు (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి డెబ్బై రోజులుగా చికిత్స పొందుతున్న రైతు గురువారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఈ ఏడాది మార్చి 8వ తేదీన మహాశివరాత్రిని పురస్కరించుకుని అప్పాపురం గ్రామంలో భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. మార్చి 6వ తేదీన రాత్రి గ్రామ ప్రభకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి ఆర్కెస్ట్రా, డీజేలతో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు గణపవరం గ్రామానికి చెందిన రైతు బొప్పూడి అప్పారావు (56) తన భార్య విజయలక్ష్మితో కలిసి అదేరోజు కొన్న కొత్త మోటార్ బైక్‌పై బయలు దేరారు. నరసరావుపేట-చిలకలూరిపేట రోడ్డు నుండి అప్పాపురం వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా, నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అప్పారావును గుంటూరు జీజీహెచ్‌లో చేర్చారు. అప్పటి నుండి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. ఆయనకు ఇరువురు కుమార్తెలు కాగా, పెద్ద కుమార్తె దివ్య అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్లగా, రెండో కుమార్తె భావన ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో చదువుతోంది. గ్రామానికి చెందిన పలువురు నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

రొంపిచర్లలో క్షయవ్యాధి నివారణ టీకాలు



వయోజనులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 18 సచివాలయాలలో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వయోజన క్షయవ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ టీకాలను 18 సంవత్సరాలు పైబడిన వారికే వేస్తారు. ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వారికి, క్షయవ్యాధి వచ్చి తగ్గిన వారికి, మద్యం, ధూమపానం అలవాటు ఉన్నవారికి, క్షయవ్యాధి మందులు వాడుతున్న వారికి, టీబీ రోగి కుటుంబ సభ్యులకు టీకాలు వేస్తున్నారు. ఈ ఆరు వర్గాలకు చెందిన వారు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రేవతీబాయి తెలిపారు. ఈ నెల 23, 30 తేదీలలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. గురువారం నిర్వహించిన టీకా కార్యక్రమానికి వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలో 200 మందికి పైగా టీకాలు వేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాలను ఎంపీహెచ్ఈవో ఎస్.ఎస్.సురేష్ కుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్‌లు పాల్గొని నిర్వహించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవాలు ప్రారంభం

చిలకలూరిపేట టౌన్: ఆర్యవైశ్యుల కులవర్ధిని వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ధర్మసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని చౌత్ర సెంటర్లో వాసవీ జ్ఞానమందిరంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజున కన్యకా సుప్రభాతంతో మొదలై గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీపారాధన, నవగ్రహ పూజలు జరిగాయి. అలాగే అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సామూహికంగా అష్టోత్తర, సహస్ర నామ, కుంకుమ పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 17న పలు పూజలతో పాటు భజనా కార్యక్రమం, 18న అమ్మవారి ఉత్సవమూర్తిని బచ్చు ఓంకారదేవి ఆధ్వర్యంలో 102 మందిచే తెచ్చిన జలాలతో అభిషేకం, తీర్థప్రసాదాల వినియోగం చేయనున్నట్లు తెలిపారు.

డెంగీ నివారణ ర్యాలీ




రాజుపాలెం: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధుల్లో డెంగీని నివారిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, దోమల వ్యాప్తిని అరికట్టాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, స్టాఫ్‌నర్సు సౌజన్య, ఫార్మాసిస్టు శివ, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, తిరుపతమ్మ, ధనలక్ష్మి, ఆశ కార్యకర్తలు, రాధ, ప్రసన్న, అనురాధ, సంతోషం పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయవ్యాధి నిర్మూలన

జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టరు మురళీకృష్ణ

శావల్యాపురం: రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో క్షయ వ్యాధి నూరు శాతం నిర్మూలనకు ప్రత్యేకంగా బీసీజీ టీకా వేస్తున్నట్లు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టరు మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామాల్లో బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్షయ వ్యాధితో బాధపడిన వారందరు, షుగర్ వ్యాధిగ్రస్తులు 18 సంవత్సరాల పైబడిన వారందరు తప్పనిసరిగా ఈటీకా చేయించుకోవాలన్నారు. పొగ తాగేవారు, బియ్యం 18 కన్నా తక్కువ ఉన్నవారు, టీబీ వ్యాధిగ్రస్తులు, ఈటీకా చేయించుకోవటం ద్వారా భవిష్యత్‌లో క్షయ వ్యాధి బారిన పడకుండా ఉంటారన్నారు. శావల్యాపురం మండలంలో 550 మంది చేయాల్సి ఉందని మూడు నెలల వ్యవధిలో ప్రతినెలా గురువారం రోజున ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీసీజీ టీకా చేస్తామన్నారు. ఆయనతో పాటు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంకోల్లు నాగలక్ష్మి, దాసరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి సెంటిమెంట్ ఎవరికో.!



సత్తెనపల్లి నియోజకవర్గ మ్యాప్



సత్తెనపల్లి గడియార స్తంభం సెంటరు

- ఇక్కడ గెలిచిన అభ్యర్థి పార్టీ ప్రభుత్వం ఏర్పాటు
- కొనసాగుతూ వస్తున్న సాంప్రదాయం
- పోలింగ్ వైఎస్సార్ సీపీకీ అనుకూలమేనన్న పరిశీలకులు
- పి.అనిల్‌కుమార్‌యాదవ్, అంబటి గెలుపు పవనాలు

సత్తెనపల్లి: రాష్ట్రంలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. అలాగే సత్తెనపల్లిలో ఏ పార్టి అభ్యర్థి అయితే గెలుపొందుతారో ఆ పార్టీ అధికారంలోకి వచ్చే సంప్రదాయం కొనసాగుతోంది. ఇప్పుడు ఈ సెంటిమెంట్ 2024లో ఎవరికి వర్కవుట్ అవుతుందోనని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

1952 నుంచి...

గత నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. సత్తెనపల్లి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. 1952లో స్వాతంత్య్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం 1955(సీపీఐ), 1962, 1967లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇక అక్కడి నుంచి 1972లో గాదె వీరాంజనేయ శర్మ, 1978లో డాక్టర్ రావెల వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు కాగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 1983లో నన్నపనేని రాజకుమారి గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1985లో పుతుంబాక వెంకటపతి సీపీఎం నుంచి గెలుపొందగా అప్పట్లో వామపక్షాల మద్దతుతో టీడీపీ గెలుపొందింది. 1989లో దొడ్డా బాలకోటిరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 1994లో పుతుంబాక భారతి సీపీఎం నుంచి గెలుపొందగా అప్పట్లో వామపక్షాల మద్దతుతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1999లో వైవీ ఆంజనేయులు టీడీపీ నుంచి గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది.

గత చరిత్ర పునరావృతం అయ్యేనా..

ఇక 2004లో యర్రం వెంకటేశ్వరరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. 2009లో యర్రం వెంకటేశ్వరరెడ్డి మరోసారి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చింది. వావిలాల తర్వాత వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రెండో వ్యక్తిగా యర్రం వెంకటేశ్వరరెడ్డి రికార్డులకెక్కారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు టీడీపీ నుంచి కేవలం 924 స్వల్ప ఓట్లతో గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2019 ఎన్నికల్లో అంబటి రాంబాబు వైఎస్సార్ సీపీ నుంచి 20,876 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందగా రాష్ట్రంలో 151 సీట్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తొలిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల సరళిని పరిశీలిస్తే.. మళ్లీ అంబటి రాంబాబు రెండో సారి ఎమ్మెల్యేగా.. గెలుపొంది...సీఎంగా వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి చేయనున్నారని వైఎస్సార్ సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భర్త మందలించాడంటూ భార్య ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: భర్త మందలించాడని భార్య ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని కృష్ణారెడ్డి డొంకకు చెందిన బెజ్జం లక్ష్మి (28) గత రెండు నెలల కిందటి వరకు వేద పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. ప్రస్తుతం ఖాళీగానే ఉంటోంది. భర్త అన్వేష్ కుమార్ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు చేస్తుండటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 12 రాత్రి భార్యను మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన భార్య లక్ష్మి అదేరోజు తెల్లవారుజామున 13 తెల్లవారుజామున ఎలుకల పేస్టు తిని అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి పిడతల సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన వేడుకలు నేడు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పులుకూరి శ్రీనివాసచారి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో ఆరాధన వేడుకలు గత 10 సంవత్సరాల నుంచి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలకు కులమతాలకు అతీతంగా ఆరాధన వేడుకలుదాతల సారథ్యంలో అంగరంగ వైభవంగా జరుపుతామన్నారు. ఆరాధన వేడుకలు సందర్భంగా భారీ అన్నదానం కార్యక్రమం కూడా ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎం అండ్ హెచ్‌వో



విప్పర్లలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి. రవి

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో నిర్వహిస్తున్న వయోజన క్షయవ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి. రవి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టీకాల కోసం వచ్చిన వయోజనులతో మాట్లాడారు. ముఖ్యంగా 18 ఏళ్లకు పైబడిన వయోజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వయోజనులకు వివరించారు. అలాగే ఈ నెల 23, 30 తేదీలలో కూడా శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.